క్లుప్తంగా

వ్యసనాలకు దూరంగా జీవించండి

ఎస్ఐవో నల్లజర్ల శాఖ అధ్యక్షుడు డాక్టర్ సోహైల్ షరీఫ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సోహైల్ షరీఫ్

నల్లజర్ల: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, నైతిక విలువలకు కట్టుబడి, తమ జీవిత లక్ష్యాల సాధనకు శ్రమించాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐవో)నల్లజర్ల శాఖ అధ్యక్షుడు డాక్టర్ సోహైల్ షరీఫ్ సూచించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్న విద్యార్థులు, యువతను సన్మార్గం వైపు మళ్లించేందుకు స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జూన్ 20న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు జూలై 20 వరకూ కొనసాగుతాయి. ఇందులో భాగంగా గురువారం నల్లజర్లలోని ఏకేఆర్జీ, ఎస్ఆర్కే, బేతల్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోహైల్ షరీఫ్ మాట్లాడుతూ నేటి యువత అశ్లీలత, నగ్నత్వం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారన్నారు. తమ విలువైన సమయాన్ని మొబైల్ గేమింగ్‌కు, బెట్టింగ్, ధూమ, మద్యపానాలు, సామాజిక మాధ్యమాలకే వెచ్చిస్తున్నారన్నారు. ఈ క్రమంలో వారు అనేక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. అలాంటి యువతకు అవగాహన కల్పించి సంస్కరించే దిశగా స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఈ తరహా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కాకినాడకు చెందిన డీటీ మొహిద్దీన్ కూడా పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలి

నల్లజర్ల: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ వై.సత్యనారాయణ సూచించారు. మండలంలోని ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని గురువారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించారు. ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల చేరికలను పెంచాలన్నారు. డ్రాపవుట్‌లను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నారు. అలాగే విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం వంటి విషయాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.గత ఐదేళ్లలో ఎన్‌రోల్‌మెంట్ ఏ విధంగా ఉంది? ఈ ఏడాది ఏవిధంగా ఉందనే విషయాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 భగవతి, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షుడిగా ముళ్లపూడి



ముళ్లపూడి రామచంద్రం

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా అన్నదేవరపేటకు చెందిన ముళ్లపూడి రామచంద్రం నియమితులయ్యారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సమక్షంలో గురువారం కొవ్వూరులో నిర్వహించిన ఆయకట్టుదారుల సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ ఆయ కట్టు పరిధిలోని మొత్తం 4,950 ఎకరాలకు సక్రమంగా నీరు అందించేలా కమిటీ పని చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి సూచించారు. నూతన కమిటీలో ఆయకట్టు పరిధిలోని అన్ని గ్రామాలకూ సముచిత స్థానం కల్పిస్తూ సభ్యులను ఎంపిక చేశామని తెలిపారు. ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యులుగా వీరమల్ల బంగార్రాజు, కవులూరి వెంకటేశ్వరరావు, మద్దిపాటి శ్రీను, మద్దుకురి రామకృష్ణ, గన్నిన సత్తిబాబు, అనపర్తి వీరభద్రం, మంద గోవిందరాజు, మైగాపుల సంపతిరావు, కందుల బాల నాగేశ్వరరావు, చాదరాసి నాగరాజు నియమితులయ్యారు. సమావేశంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, జీవీ ప్రసాద్, యువ నాయకుడు అల్లూరు విక్రమాదిత్య పాల్గొన్నారు.

29న మిస్ రాజమహేంద్రవరం కాంటెస్ట్ ఆడిషన్స్

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో రోటరీ ఐకాన్స్ మిస్ రాజమహేంద్రవరం కాంటెస్ట్ 2024కు సంబంధించిన ఆడిషన్స్ శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జేఎన్ రోడ్డులోని డి1 కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు తీగెల రాజా తెలిపారు. ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంపై ఇప్పటికే విస్తృతంగా ప్రచారం నిర్వహించామని, సుమారు 300 వరకు ఎంట్రీలు వచ్చాయన్నారు. శనివారం వరకూ అవకాశం ఉన్నందున మరిన్ని పెరిగే అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలవారు 90520 77377 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆనం కళాకేంద్రంలో వచ్చే నెల 20వ తేదీన జరిగే ఫైనల్ జడ్జిమెంట్‌లో విజేతకు క్రౌన్‌తో పాటు బహుమతులను మిస్ ఇండియా వరల్డ్ 2023 నందినీ గుప్తా చేతుల మీదుగా అందజేస్తామన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు పి.రఘునాథరాజు పాల్గొన్నారు.

భవనాలు శిథిలం.. హాస్టళ్లకు తాళం



విద్యార్థులు లేక మూతబడిన దేవరపల్లిలోని బాలుర వసతి గృహం

- మూతబడ్డ రెండు వసతి గృహాలు
- చేరడానికి ఆసక్తి చూపని విద్యార్థులు
- గణనీయంగా తగ్గిన చేరికలు
- నియోజకవర్గంలో 10 ప్రభుత్వ వసతి గృహాలు

దేవరపల్లి: పేద విద్యార్థులకు వసతి కల్పించేందుకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న వసతిగృహాలు (హాస్టళ్లు) మూతపడుతున్నాయి. హాస్టళ్ల భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిలో ఉండేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. రాత్రిపూట బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. ఈ భవనాలు నిర్మించి దాదాపు 25 నుంచి 30 ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరాయి. రెండేళ్లుగా హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. గత ప్రభుత్వం విద్యార్థులకు అమ్మఒడి పథకం అమలు చేయడం, ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించడం, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం వంటివి ఇందుకు కారణాలు. కొన్ని వసతి గృహాల్లో పట్టుమని పది మంది విద్యార్థులు కూడా లేకపోవడంతో వారిని సమీప వసతి గృహాల్లో చేర్పించి, మిగతా హాస్టళ్లను మూసివేశారు. వసతి గృహాల్లో కనీస వసతులు, భవనాలు నివాస యోగ్యంగా లేకపోవడం వంటి కారణాలతో వాటిలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. గోపాలపురం నియోజకవర్గంలో 10 ప్రభుత్వ వసతి గృహాలు ఉండగా, ఇప్పటికే రెండు మూతబడ్డాయి. మరో రెండు మూతబడే అవకాశం ఉంది.

గ్రామం	విద్యార్థుల సంఖ్య
చిన్నాయగూడెం బాలికలు	100
యర్నగూడెం బాలురు	12
యర్నగూడెం బాలికలు	62
దుద్దుకూరు బాలికలు	37
గౌరీపట్నం బాలురు	7
గోపాలపురం బాలురు	12
రేగులకుంట బాలురు	12
నల్లజర్ల ఆనంద నిలయం	22
మొత్తం	264

కనీస మరమ్మతులకు నోచుకోలేదు

ప్రభుత్వ వసతి గృహాలను నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నా వాటి నిర్వహణ గురించి పాలకులు పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపణ. భవనాలు శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కనీస మరమ్మతులు చేయలేదని విమర్శిస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 10 సాంఘిక సంక్షేమ ప్రభుత్వ వసతి గృహాలున్నాయి. వాటిలో మూడు బాలికలవి కాగా, ఏడు బాలుర వసతి గృహాలు. పది వసతి గృహాల్లో

మొత్తం విద్యార్థుల సంఖ్య 262

చిన్నాయగూడెంలో బాలికల ఇంటిగ్రేటెడ్ ప్రత్యేక వసతి గృహాన్ని నిర్మించారు. దేవరపల్లి, గోపాలపురం మండలం కొవ్వూరుపాడు గ్రామాల బాలుర హాస్టళ్లలో విద్యార్థులు లేక గతేడాది మూసివేశారు. గౌరీపట్నంలో బాలుర వసతి గృహ భవనం పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. దీనిలో ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ భవనం నిర్మించి, దాదాపు 30 ఏళ్లవుతోంది. హాస్టల్‌కు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. భవనం పై కప్పు బీటలు తీసి వర్షపు నీరు ధారలుగా గదుల్లో పడుతోందని వారు వివరించారు. రాత్రి వేళ పాములు వస్తున్నాయని వాపోతున్నారు. ఇక యర్నగూడెంలోని బాలుర వసతి గృహం పూర్తిగా శిథిలమైంది ప్రస్తుతం 12 మంది విద్యార్థులు ఉన్నారు. గోపాలపురం బాలుర వసతి గృహం, రేగులకుంట వసతి గృహాల్లో కేవలం 12 మంది చొప్పున విద్యార్థులు ఉన్నారు. గోపాలపురం బాలుర వసతి గృహ భవనం పూర్తిగా శిథిలమైంది. ఇలాంటి హాస్టళ్ల భవనాలను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నియోకవర్గంలోని వసతి గృహాలు, విద్యార్థుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

నూతన భవనాల నిర్మాణం చేపట్టాలి



సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహ భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. విద్యార్థులు భయంభయంగా కాలం గడుపుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని వసతి గృహాల భవనాలు నివాసయోగ్యంగా లేవు. శిథిలమైన భవనాలను ఖాళీ చేసి అద్దె భవనాల్లోకి మార్చాలి. దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన గౌరీపట్నం వసతి గృహం కూలేందుకు సిద్ధంగా ఉంది. పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. లోతట్టు ప్రాంతంలో ఉండడం వల్ల వర్షం నీరు గదుల్లోకి వస్తుంది.

– కుండా వినాయక విజయ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు, గౌరీపట్నం

నివేదిక పంపించాం



శిథిలమైన వసతి గృహాల మరమ్మతులకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. దేవరపల్లి, గౌరీపట్నం, గోపాలపురం, యర్నగూడెం, రేగులకుంట బాలుర వసతిగృహాలు, యర్నగూడెంలోని బాలికల ప్రత్యేక వసతి గృహం భవనాలు శిథిలావస్థకు చేరాయి. రేగులకుంట వసతి గృహాన్ని అద్దె భవనంలోకి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయి. వసతిగృహానికి ఐదు కిలోమీటర్లు పైబడి దూరం ఉన్న గ్రామాల విద్యార్థులు హాస్టల్లో చేరుందుకు అర్హులు. దేవరపల్లి, కొవ్వూరుపాడు వసతి గృహాలను మూసి వేశాము. గౌరీపట్నం హాస్టల్‌ను కూడా మూసి వేసే అవకాశం ఉంది. టెన్త్ విద్యార్థులకు జూలై 1 నుంచి ప్రైవేటు తరగతులు నిర్వహిస్తాం.

– ఆర్‌వీ శ్రీనివాస్, ఏఎస్‌డబ్ల్యూఓ, దేవరపల్లి

సమస్యల పరిష్కారం మాని రౌడీయిజమా?



గోపాలపురంలో వైఎస్సార్ సీపీ మండల శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న తానేటి వనిత. చిత్రంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

- తెలుగుదేశం శ్రేణులపై మాజీ మంత్రి తానేటి వనిత ధ్వజం
- వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం
- పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

గోపాలపురం: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా సమస్యల పరిష్కారాన్ని గాలికి వదిలేసి వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు దిగుతూ, రౌడీయిజం చేయడం సిగ్గు చేటని మాజీ హోం మంత్రి తానేటి వనిత విమర్శించారు. వైఎస్సార్ సీపీ మండల స్థాయి నాయకుల, కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని గురువారం స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తానేటి వనిత మాట్లాడుతూ టీడీపీ మూకలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నందున వైఎస్సార్ సీపీ మండల, గ్రామస్థాయి నాయకులు ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారు. నిన్నటి ఓటమి రేపటి గెలుపునకు నాంది మాత్రమే అని వనిత అన్నారు. పార్టీ అధినాయకుడు జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని పిలుపు నిచ్చారు. అధికార పార్టీ నాయకుల రౌడీయిజానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు

కేంద్రంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయని, దేశంలో ఎప్పుడైనా మళ్లీ ఎన్నికలు రావచ్చని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. దేశంలో ఏరాష్ట్రం చేయలేని సంక్షేమాన్ని ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓటమికి అమలు సాధ్యం కానీ చంద్రబాబు హామీలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై అసత్య ప్రచారాలే కారణమన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు తిరుగుబాటు చేస్తారని, ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని పేర్కొన్నారు. నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని శ్రీనివాస్ కార్యకర్తలకు భరోసా కల్పించారు. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వండి



కొవ్వూరు మండలం వేములూరు స్కూల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ వాసుదేవరావు



ఉడకబెట్టిన కోడిగుడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న డీఈఓ వాసుదేవరావు

- డీఈఓ కె.వాసుదేవరావు
- వేములూరు స్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన
- కోడిగుడ్ల నాణ్యతపై అసంతృప్తి

కొవ్వూరు: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కె.వాసుదేవరావు ఆదేశించారు. మండలంలోని వేములూరు ఎంపీ యూపీ పాఠశాలను గురువారం ఆయన సందర్శించి, మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును పరిశీలించారు. కోడిగుడ్లు నాణ్యంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉడకబెట్టే ముందు గుడ్ల నాణ్యతను పరిశీలించుకోవాలని ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నిర్వాహకులను డీఈఓ ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించబోనని హెచ్చరించారు. అనంతరం వాసుదేవరావు కొవ్వూరు పట్టణంలోని యానాద కాలనీలోని ఎంపీఈపీ పాఠశాలను సందర్శించి, అక్కడి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. ఒకటో తరగతి విద్యార్థులకు నిర్దేశించిన విద్యా ప్రవేశ్ కృత్యాలను పరిశీలించారు. ఇప్పటి వరకూ స్టూడెంట్స్ కిట్స్ ఎంతమంది విద్యార్థులకు అందించారని ఆరా తీశారు. స్వయంగా విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించారు. విద్యార్థులతో చదివించడంతో పాటు రాయించడం, ధారాళంగా మాట్లాడడం నేర్పించాలని ఈ సందర్భంగా డీఈఓ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అదే ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వాసుదేవరావు సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. ఎంఈవో జె. కెంపురత్నం, ఎంఈవో–2 రామ్‌కిషోర్, ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని, యు.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కానూరులో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



కానూరులో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న అవంతీ ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్ర కుమార్

పెరవలి: కానూరు గ్రామస్తుల దాహార్తిని తీర్చడం ఎంతో ఆనందంగా ఉందని అవంతి ఫీడ్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. అవంతి ఫీడ్స్ సంస్థ రూ.10 లక్షల వ్యయంతో కానూరు గ్రామంలో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను గురువారం ఇంద్రకుమార్ ఆవిష్కరించారు. ఈ ఆర్వో ప్లాంట్‌కు అవసరమైన షెడ్ నిర్మాణానికి గారపాటి గంటన్న అనే దాత ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కానూరు సర్పంచ్ భావన మధు, టీడీపీ నాయకులు కుందుల సత్యనారాయణ, అనపర్తి వెంకట నారాయణ, అనపర్తి సత్యనారాయణ, వై నాట్ సంస్థల అధినేత జుజ్జవరపు వెంకటరాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలోచనా విధానం మార్చుకోండి

- అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ హితవు
- పెరవలి, నిడదవోలుల్లో సమీక్షలు



నిడదవోలులో విద్యార్థినికి స్టూడెంట్స్ కిట్ అందిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి: ఐదేళ్లుగా ఒక ప్రభుత్వంలో ఒకే ఆలోచనతో పని చేసిన అధికారులు ఇప్పుడు తమ విధానాన్ని మార్చుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ఇకపై కూడా ఒకే మూసలో పని చేస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. మండలంలోని గ్రామ, సచివాలయాల సిబ్బంది, అధికారులతో పెరవలి దీపికా ఫంక్షన్ హాల్లో గురువారం సాయంత్రం ఆయన సమీక్ష జరిపారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఏ పథకం విజయవంతం కావాలన్నా వెనుక గ్రామ స్థాయి అధికారులు అందించే సేవలే కారణం అవుతాయన్నారు. ఇకపై సమష్టిగా పని చేద్దామని సూచించారు. రూ.ఏడు వేల పింఛను కానుక సొమ్మును కేవలం సచివాలయ సిబ్బంది మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో రోడ్ల స్థితిగతులను పరిశీలించి, రహదారుల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను మంత్రి దుర్గేష్ ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి, తహసీల్దార్ డి. సుధ, వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

నిడదవోలు: ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం లబ్ధిదారులందరికీ చేరేలా అధికారులందరూ చిత్తశుద్ధితో పని చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలం, పట్టణంలోని అధికారులతో సమీక్ష సమావే శాన్ని గురువారం పట్టణంలో ఆయన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులతో ఆయన సమీక్షించారు. రాజకీయంగా బేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ గత ప్రభుత్వ నిర్ణయాలను ఈ ప్రభుత్వం కూడా కొనసాగించవచ్చన్నారు. వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, సంక్షేమ పథకాలు, వివిధ రకాల పింఛన్ల అమలు తీరుపై మంత్రి అధికారులతో సమీక్షించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ కమిషనర్ టి. రాంభూపాల్ రెడ్డి, టిడ్కో ఎస్ఈ బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీవో జేపీ ఝాన్సీ, హౌసింగ్ ఈఈ పరశురాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కూల్లో నేర్చుకున్న క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయికి ..

విద్యార్థులు పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ వారు జీవితంలో ఉన్నత దశకు చేరుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులకు బ్యాగ్స్, పాఠ్య పుస్తకాల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో లేనన్ని మౌలిక వసతులను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్నామన్నారు.అలాగే ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షల్లో ఈ హైస్కూల్లో అత్యధిక మార్కులు సాధించిన 16 మంది మెరిట్ విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో, మంత్రి చేతుల మీదుగా మెమెంటోలు అందించారు. అలాగే రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో రూ. లక్ష వ్యయంతో ఈ పాఠశాలలో నిర్మించిన స్టేజ్‌ను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, టీడీపీ, జనసేన పట్టణ శాఖల అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, హెచ్ఎం చెరుకూరి పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డీఎస్‌వో మున్సిపల్ హైస్కూల్‌లో..

పట్టణంలోని డీఎస్‌వో మున్సిపల్ హైస్కూల్లోని విద్యార్థులకు గురువారం ఆయన బ్యాగ్‌లు, పాఠ్య పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నేతల భీమారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూరజ్ ప్రకాష్‌కు ఘనంగా నివాళి

కొవ్వూరు: భారత వికాస పరిషత్ వ్యవస్థాపకుడు డాక్టర్ సూరజ్ ప్రకాష్ జయంతిని గురువారం పట్టణంలో నిర్వహించారు. భారత వికాస పరిషత్ కొవ్వూరుశాఖ అధ్యక్షుడు, హోమియో వైద్యుడు కోట సత్యనారాయణమూర్తి ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. 1963 జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చైనా దండయాత్రను ఎదుర్కోవడానికి లాలా హన్సరాజ్, డాక్టర్ సూరజ్ ప్రకాష్‌లు పలువురు పారిశ్రామిక వేత్తలు, సంఘ సంస్కర్తలతో కలసి సిటిజన్స్ కౌన్సిల్ అనే సంస్థను స్థాపించారన్నారు. తదనంతరం దానిని భారత వికాస్ పరిషత్‌గా పేరు మార్చారన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరీశంకర్, కోశాధికారి టి.రామచంద్రరావు, గోవర్ధనం శ్రీనివాసమూర్తి, ఎస్.రాఘవేంద్రరావు సూరజ్ ప్రకాష్‌కు నివాళి అర్పించారు.

ఉద్యాన పరిశోధనా కేంద్రాలుగా నర్సరీలు

కడియం: ఉద్యాన పరిశోధనా కేంద్రాలుగా కడియం ప్రాంత నర్సరీలు పనిచేస్తున్నాయని హైదరాబాద్‌కు చెందిన అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, డాక్టర్ ఆర్‌కే మాధుర్ అన్నారు. కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన సత్యదేవ నర్సరీని వంద మంది శాస్త్రవేత్తల బృందంతో కలిసి వీరు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ, విదేశీ రకాలకు చెందిన ఉద్యాన మొక్కలు ఒకేచోట లభించే ఏకైక ప్రాంతం కడియమన్నారు. కొన్ని వేల రకాల మొక్కలు, శాస్త్రీయ నామాలను గురించి తెలుసుకోవచ్చన్నారు. అందుకే తాము ఏర్పాటు చేసే విజ్ఞాన ప్రదర్శనలలో కడియం ప్రాంతాన్ని ఎంచుకుంటామని వివరించారు. ఉద్యాన శిక్షకులు ప్రమీలా రాణి, కరుణశ్రీ మాట్లాడారు. వివిధ రకాల మొక్కల గురించి పుల్లా చంటియ్య, పెద సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో పుల్లా రామకృష్ణ, పుల్లా వీరబాబు, మెర్ల కృష్ణ పాల్గొన్నారు.

పేదలకు జీరో బ్యాలెన్స్ ఖాతాలు

రాజమహేంద్రవరం సిటీ: నయనాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు జీరో బ్యాలెన్స్ ఖాతాలు ప్రారంభించడం అభినందనీయమని ఇన్నీసుపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (కోళ్ల బాబు) అన్నారు. నయనాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాంకు ఆఫ్ బరోడా టి.నగర్ శాఖ ద్వారా గురువారం పేదలు, విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు తెరిచారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

- పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా
- ఆదర్శంగా గోపాలపురం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా
- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళదామని, అందుకు అధికారులు, ప్రజలు సహకరించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కోరారు. మండల స్థాయి అధికారులతో దేవరపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ అధికారులపై ఎటువంటి ఒత్తిడీ ఉండదన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గోపాలపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. త్వరలో నియోజకవర్గస్థాయి కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తానని, అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారాని కృషి చేస్తానని ప్రకటించారు. సమావేశంలో ఎంపీడీఓ పి.ప్రభాకరరావు, తహసీల్దార్ వైపీ చారి, సీఐ బాల సురేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కొయ్యలమూడి సుధారాణి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఆండ్రు అనీల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మండపానికి ప్రారంభోత్సవం

సంగాయగూడెంలో దాతల తోడ్పాటుతో నిర్మించిన ఎన్టీఆర్ మండపాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, సర్పంచ్ కరుటూరి ఉషారాణిని తన చాంబర్‌లో కూర్చోబెట్టారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ డి. సువర్ణరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేరు మార్పు